క్లుప్తంగా

పరిసరాలు శుభ్రం



చెరకు వ్యర్థాలను దగ్గరుండి ఎత్తిస్తున్న పారిశుధ్య అధికారి సతీష్‌యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం వద్ద జోడుగుడుల అమ్మవార్ల పరస శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అయితే పరస చూడటానికి వచ్చిన సందర్శకులు.. వ్యాపారులు వ్యర్థాలను నిర్లక్ష్యంగా రోడ్డుపై డంప్ చేశారు. దీంతో శనివారం 20 మంది పారిశుధ్య కార్మికులు ఆ వ్యర్థాలను ఎత్తివేసి పరిశుభ్రం చేశారు. 8 టన్నుల వ్యర్థాలను పారిశుధ్య అధికారి సతీష్‌యాదవ్ దగ్గరుండి తొలగింపజేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



స్మార్ట్ సిటీ నమూనాతో విద్యార్థులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పలు తరగతుల విద్యార్థులు స్మార్ట్ సిటీ ప్లానింగ్, సేంద్రియ వ్యవసాయం, వ్యర్థ నీటితో మంచి నీటి తయారీ ప్లాంట్,కాలుష్య నిర్మూలనకు అవసరమైన యంత్రాల నమూనాలు ప్రదర్శనలో ఉంచారు. వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, ఎంఈవో తినాథరావు, పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవ రావు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మల్కాపురం: ప్రతి ఇంట్లో మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని ధర్మానంద అన్నారు. రామచంద్ర బౌద్ధారామం ఆధ్వర్యంలో శనివారం శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. నాటే మొక్క ప్రాణవాయువు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

గోపాలపట్నం: గోపాలపట్నంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలకు ప్రతిష్ఠాత్మకంగా నాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) కమిటీ 2024 అక్టోబర్‌లో కళాశాలను సందర్శించిందని పేర్కొన్నారు. రెండురోజుల పాటు పరిశీలించిన కమిటీ సభ్యులు కళాశాలలో విద్యాప్రమాణాలు, విద్యార్థుల క్రమశిక్షణ, అధ్యాపకుల అంకితభావం వంటి పలు అంశాలను గుర్తించి ఏ గ్రేడ్ అర్హత ఇచ్చిందన్నారు. విద్యార్థులకు మంచి బోధన అందించి ఉత్తమ విజయాలు సాధించేందుకు ఈ అవార్డు ఉపకరిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.

ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పులి వెంకటరమణారెడ్డి కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం శనివారం నిర్వహించిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులు బకాయిలతో పాటు ప్రతీనెలా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. పోరాట, పరిరక్షణ కమిటీ చేపట్టే ఉద్యమాలకు నిర్వాసితులు సహకారం అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.సన్యాసిరావు, ఎం. గోపి, శ్రీనివాస్, ఎం.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో యోగం

- శ్వాసమీద ధ్యాన ఉంచితే ఎంతో ఉపశమనం
- యోగాసనాలపై పెరుగుతున్న ఆసక్తి
- అల్లూరి పార్కులో ప్రత్యేక యోగా శిబిరం
- 30 మంది జట్టుగా ఏర్పడి మహిళలకు ఉచితంగా యోగా శిక్షణ



శిక్షణలో యోగాసనాలు వేస్తున్న మహిళలు





యోగాసనాలు వేస్తున్న మహిళలు

విశాఖ విద్య: ఉరుకుల పరుగుల జీవనంలో ప్రతీ మనిషిని ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. సరైన ఆహార పద్ధతులు, వ్యాయామం లేకపోవడంతో మూడు పదులు దాటకుండానే శారీరక అలసట, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు.అలాంటి వారికి యోగా సాధన దివ్య ఔషధంలా పని చేయడంతో అంతా యోగాపై మక్కువ చూపుతున్నారు. మరి కొంత మంది నేర్చుకున్న విద్యను పది మందికి పంచుతూ యోగాను విస్తృతం చేస్తున్నారు.

పెరిగిన ఆసక్తి

యోగా ప్రయోజనాలను వివరించడంతో ప్రజానీకంలో ఆసక్తి పెరుగుతోంది. రోజులో కాసింత సేపైనా యోగా చేసేందుకు సమయం కేటాయిస్తున్నారు. విశాఖ నగరంలో యోగా కేంద్రాలు సైతం రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కాలనీల్లో పార్కులే యోగా కేంద్రాలుగా మారుతున్నాయి. ఇలాంటి చోట్ల కొంతమంది యోగా నిపుణులు సేవా భావంతో పదిమందికీ యోగా నేర్పించేందుకు తమవంతు కృషి చేస్తున్నారు.

అల్లూరి పార్కులో ఉచిత శిక్షణ

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని అల్లూరి సీతారామరాజు కాలనీ యోగా ట్రైనర్ పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. పార్కులో ప్రతీ రోజూ ఉదయం 5.15 నుంచి 7గంటల వరకు ఉచిత యోగ శిక్షణ ఇస్తున్నారు. దీనికి పరిసర కాలనీలకు చెందిన వారు సుమారు 50 మంది వరకు పాల్గొంటున్నారు. యోగాలో ఎమ్మెస్సీ కోర్సు చేసిన ట్రైనర్ ఎస్. పుష్పలత తన ప్రావీణ్యంతో ప్రత్యేక తర్ఫీదు ఇస్తుండడంతో ఎక్కువగా మహిళలు దీనిలో భాగస్వాములవుతున్నారు.

వాట్సాప్ గ్రూప్‌తో ఒక్కటై

బుచ్చిరాజుపాలెం అల్లూరి సీతారామరాజు కాలనీ చెందిన మహిళలు 30 మంది వరకు టీమ్‌గా ఏర్పడి, యోగాపై పరిసర కాలనీల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ పండగ రోజుల్లో ప్రజలకు సంస్కృతి, సంప్రదాయాలు, ఆరోగ్య పరిరక్షణ నియమాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌లో ఎక్కడ కార్యక్రమం జరుగుతుంది, ఎప్పుడు రావాలనే సమాచారం చేరవేసుకొని, సమాజహితం కోసం చేపట్టే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

అందరూ బాగుండాలనే..



యోగాపై మక్కువతో ఎనిమిదేళ్లగా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశాను. యోగా కార్యక్రమాలు ఎక్కడ జరిగినా, మనసు అటు లాగుతుంది. యోగా వల్లే ఆరోగ్యంగా ఉన్నాను. నాతో పాటు అందరూ బాగుండాలనే తపనతోనే బుచ్చిరాజుపాలెం పార్కులో ఉచితంగా మహిళలకు శిక్షణ ఇస్తున్నాను.

– ఎస్. పుష్పలత, యోగా ట్రైనర్

ఆరోగ్యంగా ఉన్నాను



యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉన్నాను. రెండేళ్లగా యోగాను క్రమం తప్పకుండా చేస్తున్నాను. మా పాపతో పార్కుకు వచ్చి యోగా శిక్షణలో పాల్గొంటాను. యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్యపరమైన లాభాలను కాలనీలో మిగతా వారికి కూడా చెబుతున్నాను.

– బి.రేణుకా క్రాంతి, ఏపీఎస్ఈబీ కాలనీ

యోగాతో ఎంతో మేలు



యోగా సాధనతో ఎంతో మేలు ఉంది. ఇంటి వద్ద టైలరింగ్ చేస్తుంటాను. ఎక్కువ సమయం మిషన్‌పై ఉండడం వల్ల వెన్నునొప్పి, విపరీతమైన అలసట ఉండేది. మా కాలనీలోని మహిళలు యోగా గురించి చెబితే కొన్ని రోజులు పార్కుకు వచ్చి యోగా చేశాను. ఎంతో ఉపశమనం కనిపించింది. అందుకే మూడేళ్లుగా పార్కుకు వచ్చి యోగాలో పాల్గొంటున్నాను.

– ఈశ్వరి, సీతారామరాజు కాలనీ

అనారోగ్య సమస్యల నుంచి బయటపడ్డా



ఇంటి వద్ద కిరాణా దుకాణంలో ఎక్కువ సేపు ఉండాల్సి రావడంతో అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. గర్భసంచి తీసేయాలని వైద్యులు చెప్పారు. యోగా గురించి తెలుసుకొని ప్రతీ రోజూ ఉదయం దీనికి సమయం కేటాయించాను. ఆపరేషన్ చేయాల్సిన పనిలేకుండానే ఆరోగ్యం కుదటపడింది. అందుకే ఆరేళ్లగా ప్రతీ రోజూ యోగా చేస్తున్నాను.

– సంతోషిమాత, ఏపీఎస్ఈబీ కాలనీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యోగా టీమ్ సభ్యులు



యోగా శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

భక్తులకు ఆహార పదార్థాల పంపిణీ



ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: కొత్తవలస ప్రాంతంలో ఉన్న వ్యాకులమాత పుణ్యక్షేత్రానికి ఎస్‌పీడీ పరిసర కాలనీ నుంచి వేలాదిగా భక్తులు కాలినడకన తరలివెళ్తున్నారు. వారి సౌకర్యార్థం ఎస్‌పీడీ సెంటర్‌లో తిను బండారాలు, ఆహార పదార్థాలను ఏర్పాటు చేసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కాలినడకన వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతీ ఏటా దాతలు ముందుకొచ్చి ఆహార పదార్థాలు అందజేయడం అభినందనీయమన్నారు.

నిరాశ్రయులకు సేవ చేయడంలో సంతృప్తి

యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి



భోజనం ఏర్పాట్లు పరిశీలిస్తున్న సత్యవేణి

విశాఖ విద్య: నిరాశ్రయులకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి అన్నారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నిరాశ్రయుల షెల్టర్‌ను శనివారం ఆమె సందర్శించారు. అదే సమయంలో నిరాశ్రయులకు భోజనం అందిస్తుండటంతో వాటి రుచి ఎలా ఉందని అక్కడ ఆశ్రయం పొందుతున్న వారిని అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయ వసతి గృహంలో సదుపాయాలు ఎలా ఉన్నాయని, ఏమైనా అవసరాలు కల్పించాల్సిన అవసరం ఉందా అనేది తెలుసుకున్నారు. అదే విధంగా షెల్టర్‌కు సంబంధించిన రిజిస్టర్ లు పరిశీలించారు. షెల్టర్ పరిశుభ్రం గా ఉంచడంతో మేనేజర్ ఎల్లేటి మమతను అభినందించారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల స్వీకరణ



పేదల ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ గ్రామంలోని భగత్‌సింగ్ జంక్షన్ వద్ద శనివారం సీపీఐ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పేదల ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలాల ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడాల రాంబాబు, కార్యదర్శి ఎస్.వి.త్రినాథ్, మహిళా నాయకురాలు గుడాల జయ, పందిరి జయ, రమ, ముత్యాలమ్మ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర నామార్చన



సహస్ర నామార్చన పూజలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం వేకువ జామునే స్వామికి సుప్రభాత సేవ, తోమల సేవ నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి విశేష పుష్పాలతో అంగరంగ వైభవంగా వేలాదిమంది భక్తుల నడుమ సహస్ర నామార్చన నిర్వహించారు. .

విరాళాల అందజేత

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన మూలనిధికి దాతలు విరాళాలు అందజేశారు. అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన జి.నాగరాజు, నేలవేణి దంపతులు రూ.10,116లు, ఎన్ఏడీకి చెందిన కంటిపూడి దేవ్ కుమార్, మంగాదేవి దంపతులు శ్రీవారికి మేల్ ఛాట్ వస్త్రాలు, అమ్మవార్లకు పట్టు చీరలు అందజేశారు.

నేడు వ్యాకులమాత మహోత్సవం



కాలినడక సాగిపోతున్న భక్తులు

కంచరపాలెం: విశాఖ అతి మేత్రాసనం, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండ దాబాలకు చెందిన వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 2 ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో కొండ దాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు సెయింట్ పీటర్స్ విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర..

జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకన వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో పలువు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు స్నాక్స్, ఉచిత భోజనం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించారు. ఆదివారం జరిగే ఉత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సిటీ బస్సులు ఏర్పాటు చేసింది.



పాదయాత్రను ప్రారంభిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

జీవనశైలిలో మార్పులే ఒత్తిడికి మూలం

విశాఖ విద్య: జీవనశైలిలో మార్పులే ఒత్తిడికి మూలమని సాంకేతిక విద్య విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సాయి లక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ లోని సోషల్ వర్క్ విభాగంలో శనివారం 'మానవ జీవన శైలి – సోషల్ వర్కర్ పాత్ర ' అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అనేక రుగ్మతలకు జీవన శైలే ప్రధాన కారణమన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని చదువులకు అలవాటు పడాలని సూచించారు.

అనిల్‌కు అభినందన



మాజీ మంత్రి అమర్‌నాథ్‌తో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు

మల్కాపురం: వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాయపురెడ్డి అనిల్‌కుమార్ శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్‌ను అమర్‌నాథ్ అభినందించి కార్మికులకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ ,జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, పశ్చిమ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూండి మల్లేశ్వరరావు,బుజ్జి,శివ తదితరులు పాల్గొన్నారు.

ఆనందరావు నాయుడుకి అభినందనల వెల్లువ



ఆనందరావు నాయుడుకి అభినందనలు తెలుపుతున్న సహచరులు, వైఎస్సార్ సీపీ నాయకులు

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడుగా నియమితుడైన మద్ది ఆనందరావు నాయుడును శనివారం ఆయన కార్యాలయంలో పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ఆయన మాటాడుతూ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ, ఓడా శ్రీనివాసరావు, పలువురు లాయర్లు, లీగల్ సెల్ సభ్యులు ఉన్నారు.

మంచు కురిసే వేళలో..





మంచు కురిసిన వేళలో అంటూ స్థానికులు శనివారం తన్మయత్వం పొందారు. ఉదయం దట్టంగా కురిసిన పొగమంచు వల్ల ప్రకృతి ఎంతో అందంగా కనిపించింది. ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారు మంచు చూసి మంచు అందం చూడ తరమా అంటూ రాగాలు తీశారు. గోపాలపట్నం, విశాఖ విమానాశ్రయం ప్రాంతాల్లో స్నోయగం ఆకట్టుకుంది.

– గోపాలపట్నం

నేడు రెల్లి కులస్తులకు విద్యా సదస్సు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలోని ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రాష్ట్ర రెల్లి కుల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రెల్లి కులస్తులకు విద్యా సదస్సు ఏర్పాటు చేశారు. రెల్లి కుల యువతకు విద్య ఆవశ్యకతను వివరిస్తూ నిరుద్యోగ నిర్మూలనకు, ఉపాధి అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలనే అంశాలపై చర్చించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే యువతకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. రెల్లి విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కాకరలోవ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు కొట్నాన రవి కోరారు.

వాలీబాల్ పోటీల్లో విశాఖ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



జోన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి జోన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాలలో శనివారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ ప్రదీప్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలబాలికల వైద్యం కోసం ప్రత్యేక వాహనం

మహారాణిపేట : రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బాలబాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి సత్వర చికిత్స అందించేందుకు ప్రవేశ పెట్టిన ప్రత్యేక వాహనాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. 0–19 ఏళ్లలోపు బాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలతో బాధపడుతున్నవారిని గుర్తించి, వైద్య సేవలందించనున్నారు. ఆరోగ్య కేంద్రాల నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)కు తరలించే నిమిత్తం ఈ ప్రత్యేక వాహన సదుపాయం కల్పించామన్నారు. ముందుగా నిర్ణయించిన నిర్ణీత సమయాల్లో ఆయా ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడ వైద్యాధికారులు నిర్ధారించిన బాలబాలికలను డీఈఏసీ సెంటర్‌కు తరలిస్తుంది. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.హారిక, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డీమో) బి.నాగేశ్వరరావు, ఇ.శాంతిప్రియ, డీఈఐసీ మేనేజర్ మోహన్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.